క్లుప్తంగా

వీరబ్రహ్మేంద్రస్వామికి కిరీటాలు బహూకరణ

నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరంలోని శ్రీవిశ్వేశ్వరస్వామి సహిత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలోని స్వామికి, అమ్మవార్లకు శనివారం దాతలు కిరీటాలు బహూకరించారు. హైదరాబాద్‌కు చెందిన మానేపల్లి సత్యనారాయణ, వరకుమారి దంపతులు రాగిపై బంగారం తాపడం చేసిన రెండు కిరీటాలు, వడ్డాణం ధర్మకర్త భవిరి సుధాకర్, అర్చకుడు మహేశ్వరపు శ్రీనివాస్ గాంధీకి అందజేశారు. కిరీట దాతలను, వాటిని తయారు చేసిన శిల్పి దేవు మయాచార్యులు(తెనాలి)ని ఆలయ యాజమాన్యం, శ్రీవీరబ్రహ్మేంద్ర ప్రచార పరిషత్ అధ్యక్షుడు భవిరి రవి ఘనంగా సత్కరించారు. భవిరి శంకరనాథ్, శివరామకృష్ణ ప్రసాద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుని కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం



మచిలీపట్నంటౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న నగరంలోని 49వ డివిజన్‌కు చెందిన అబ్దుల్ కరీంకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి తక్షణ సాయంగా మంజూరైన లక్ష రూపాయలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), డివిజన్ కార్పొరేటర్ పల్లి శేఖర్ శనివారం అందజేశారు. కరీం భార్య రహీమున్నీసాకు ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్ని నాని, పేర్ని కిట్టుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కె.కొత్తపాలెంలో...

కె.కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె.కొత్తపాలెంకు చెందిన మావ్వళ్ల చిరంజీవి ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న శ్రీ రామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిషోర్ నాయుడు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, మండల కో–ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు పాల్గొన్నారు.

నేడు ఏఐడబ్ల్యూఎఫ్ కృష్ణాజిల్లా కార్యవర్గం ప్రమాణస్వీకారం

పెడన: ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ కృష్ణా జిల్లా శాఖ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం ఆదివారం ఉదయం 9 గంటలకు పెడనలో జరుగుతుందని ఏఐడబ్ల్యూఎఫ్ సంఘ నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మూడో వార్డులో విఘ్నేశ్వర కల్యాణ మండపంలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులందరూ హాజరవుతున్నారని పేర్కొన్నారు. చేనేత పరిశ్రమ మనుగడ, చేనేత కార్మికుల సంక్షేమం, చేనేత సహకార సంఘాల బలోపేతం తదితర అంశాలపై చర్చ ఉంటుందని తెలిపారు. చేనేత సంఘాల నాయకులు, సహకార సంఘాల ప్రతినిధులు, నాయకులు అందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా వారు కోరారు.

వైభవంగా శ్రీవిశ్వేశ్వరస్వామి వారి కల్యాణం

ఘంటసాల: మండల కేంద్రమైన ఘంటసాలలో శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారి దేవాలయంలో మహాశివరాత్రి పురస్కరించుకుని స్వామి వారి కల్యాణం, గ్రామోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఘంటసాల విజయలక్ష్మి, మాధవీలత, సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామి వార్లకు, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం ఎడ్లబండిపై మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శివరామకృష్ణ, జి.వర్ధన్, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జలధీశ్వరస్వామి వారికి భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం

ఘంటసాల: ఘంటసాలలోని శ్రీబాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి 12.02 గంటలకు మహాశివరాత్రి సందర్భంగా లింగోద్భవ కాలములో జలధీశ్వరస్వామి వారికి మహాన్యాసపూర్వకంగా ఏకాదశ రుద్రాభిషేకం అర్చకుడు కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పింఛనుదారుల ఔదార్యం

మచిలీపట్నంటౌన్: నగరంలోని 41వ డివిజన్ కుమ్మరిగూడెంకు చెందిన వైఎస్సార్ సామాజిక పింఛను లబ్ధిదారు మేరుగుమిల్లి లక్ష్మి ఇటీవల మరణించింది. తోటి పింఛనుదారులు తలొక రూ.100 చొప్పున సేకరించి వచ్చిన రూ.29,600 లను శనివారం ఆమె కుటుంబ సభ్యులకు మాజీ డెప్యూటీ మేయర్, డివిజన్ కార్పొరేటర్ లంకా సూరిబాబు, జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి డైరెక్టర్ ఉరిటి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు దార్ల చెన్నకేశవరావు చేతుల మీదుగా అందజేశారు.

12న మినీ జాబ్‌మేళా

మచిలీపట్నం టౌన్: జిల్లా ఉపాధి కల్పన శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 12న మచిలీపట్నంలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి దేవరపల్లి విక్టర్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన పదవ తరగతి, ఐటీఐ, డిప్లొమా ఇన్ మెకానిక్స్ లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసి 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు ఉన్న నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాకు హాజరుకావచ్చునని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకూ జీతం ఉంటుందన్నారు. వివరాలకు 8142416211 నంబరులో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్ చేయూతతో మహిళలకు ఆర్థిక భరోసా



గూడూరులో వైఎస్సార్ చేయూత చెక్కులు పంపిణీ చేస్తున్న ఉప్పాల హారిక, ఉప్పాల రాము

- జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక
- గూడూరులో చేయూత లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

గూడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. వైఎస్సార్ చేయూత పథకంలో భాగంగా గూడూరు మండలంలోని 3125 మంది మహిళలకు మంజూరైన రూ.5,85,93,750 నమూనా చెక్కును శనివారం గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అటువంటి మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలవాలన్న ఏకైక లక్ష్యంతోనే జగనన్న అన్ని ప్రభుత్వ పథకాలలో స్త్రీలకు లబ్ధి చేకూర్చే విధంగా రూపకల్పన చేశారన్నారు. ఎంతో దూరదృష్టితో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అక్కచెల్లెమ్మలు సద్వినియోగించుకుని ఆర్థికంగా బలపడాలని ఆకాంక్షించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

రాష్ట్రంలోని 30లక్షల పైచిలుకు మంది అక్కచెల్లెమ్మలకు సొంతింటి కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. మండలంలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్టర్ దస్తావేజులను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా జరగని విధంగా మన రాష్ట్రంలో ఏకకాలంలో ఇంత మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడమే కాకుండా గృహనిర్మాణాలకు రుణాలు కూడా మంజూరు చేశారన్నారు. ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు పూర్తి హక్కులు సంక్రమించే విధంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారన్నారు. ఒక్క గూడూరు మండలంలోనే 1084 మందికి పట్టాలు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, పెడన మార్కెట్ యార్డు చైర్మన్ గరికపాటి చారుమతి, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ మహేష్, ఏపీ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ గొరిపర్తి వరలక్ష్మి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, పర్లం పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలు నమ్మితే మళ్లీ మోసపోతారు



చల్లపల్లిలో ఇంటి స్థలం హక్కు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు
- చల్లపల్లిలో ఇంటి స్థలం హక్కు పత్రాల పంపిణీ

చల్లపల్లి: ఆడవాళ్లు బంగారం బ్యాంకుల్లో తాకట్టు పెట్టుకుంటే అధికారంలోకి రాగానే విడిపించేస్తా.. డ్వాక్రా రుణాలు మాఫీ చేసేస్తానంటూ 2014లో మోసం చేసి అధికారం పొందిన చంద్రబాబు మళ్లీ మోసపూరిత హామీలతో మహిళలను ముంచేసేందుకు ఎన్నికలకు వస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. స్థానిక సీఆర్ వికాస కేంద్రంలో శనివారం ఇళ్ల స్థలాల హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు చల్లపల్లి మండలంలో హక్కు పత్రాలు పొందిన 1,506 మంది లబ్ధిదారులకు పత్రాల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు హామీలు ఇచ్చి మోసం చేసే చంద్రబాబును మరోసారి నమ్మవద్దని, 2019 ఎన్నికల్లో పేదలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రీజనల్ కోఆర్డినేటర్ కడవకొల్లు నరసింహారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యన్నారాయణ (నాని), డెప్యూటీ తహసీల్దార్ కుమార్, ఇన్‌చార్జి ఆర్ఐ కృష్ణ మోహన్, జెడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ దిల్‌షాద్ నజరానా, సర్పంచ్‌లు వల్లూరు ఉమా, తోట శ్రీనివాసరావు, డొక్కు నాగేశ్వరరావు, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ డైరెక్టర్ మేరుగు ఝాన్సీలక్ష్మి, మండల మహిళా కన్వీనర్ బొందలపాటి లక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్ పాల్గొన్నారు.

నయనానందకరంగా దేవదేవేరుల జలవిహారం



కృత్తివెన్నులో హంసవాహనంపై ఊరేగుతున్న దేవదేవేరులు

కృత్తివెన్ను: మహాశివరాత్రి ఉత్సవాలలో రెండవరోజైన శనివారం కృత్తివెన్నులోని శ్రీ దుర్గాపార్వతీసమేత నాగేశ్వరస్వామి, శ్రీ రమాసహిత వీరవెంకట సత్యనారాయణస్వామివార్ల తెప్పోత్సవ కార్యక్రమం నయనానందకరంగా సాగింది. నిర్దేశించిన సుముహూర్తాన దేవదేవేరులు హంసవాహనంపై కొలువుతీరి ఆలయ కోనేరులో జలవిహారం చేశారు. ప్రత్యేక పూలతో అలంకరించిన హంసవాహనం, విద్యుత్ దీప కాంతుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, తెప్పోత్సవ సమయంలో దేవస్థానం వారు ఏర్పాటు చేసిన బాణసంచా వెలుగులు భక్తులను ఆకట్టుకున్నాయి. కోనేరులో మూడుమార్లు ప్రదక్షిణ సమయంలో భక్తులు హరహర మహాదేవ శంభో శంకర అంటూ చేసిన జయజయ ధ్వానాలతో ఆ ప్రాంగణం అంతా మార్మోగింది.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కృత్తివెన్నులో స్వామివారి కల్యాణమహోత్సవం

కృత్తివెన్ను: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కృత్తివెన్ను శివాలయం వద్ద శుక్రవారం రాత్రి శ్రీ దుర్గాపార్వతీసమేత నాగేశ్వరస్వామి, శ్రీ రమాసహిత వీరవెంకటసత్యనారాయణస్వామివార్ల దివ్య కల్యాణమహోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణ తంతు నిర్వహించగా వందలాది మంది భక్తులు వీక్షించారు. ఒకే వేదికమీద శివకేశవులకు కల్యాణం జరపడం ఎంతో అరుదైన విషయమని కృత్తివెన్నులో ఈ విధంగా జరపడం తమ అదృష్టమని పండితులు వివరించారు.

టెన్త్ విద్యార్థులకు ఎగ్జామ్ కిట్స్ పంపిణీ



విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న రియల్ ఫ్రెండ్ అసోసియేషన్ సభ్యులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని 20వ డివిజన్ గిలకలదిండి మునిసిపల్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రియల్ ఫ్రెండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎగ్జామ్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఆ డివిజన్ కార్పొరేటర్ తిరుమలశెట్టి వరప్రసాద్ జిల్లా మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షుడు చింతా గోవింద్, స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఒడుగు సాంబమూర్తి చేతుల మీదుగా విద్యార్థులకు ఈ కిట్లను అందజేశారు.

లింగోద్భవ వేళ శివయ్యకు అర్ధరాత్రి అభిషేకాలు

శ్రీరామపాదక్షేత్రం, సంగమేశ్వరంలో వైభవంగా శివకల్యాణం



నాగాయలంకలో నందీశ్వరునికి అభిషేకం చేసిన భక్తజనం

నాగాయలంక: మహాశివరాత్రి నాడు అత్యంత ప్రాశస్త్యమైన లింగోద్భవ కాలంలో మండలంలోని నాగాయలంక, సంగమేశ్వరం, గణపేశ్వరం శివాలయాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో అభిషేకాలు జరిపారు. స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరీ సమన్విత పార్వతీ సమేత నగరేశ్వరస్వామి ఆలయంలో నగరేశ్వరునికి గంధం, అన్నం, పలురకాల పండ్లు, విభూది, చెక్కెర, పంచామృతం తదితర 11 రకాలతో అత్యంత వైభవంగా మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలను కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధానార్చకులు కొల్లిపర సుబ్బారావు నిర్వహించారు. కృష్ణానది ఒడ్డున శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌లోని శ్రీరామలింగేశ్వర మండపం వద్ద తెల్లవారు జామున 2 గంటల వరకు సాగిన శివకల్యాణం కమనీయంగా సాగింది. దీవి ఫణికృష్ణమాచార్యులు నేతృత్వంలో వేద పండితులు కల్యాణం అపూర్వంగా జరిపారు. దాత కంఠంనేని ప్రేమ్‌చంద్, క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పూజలు చేశారు. 11మంది పండితులతో 121సార్లు అభిషేకాలు, అంతకు ముందు త్రయోదశి పురస్కరించుకుని నందీశ్వరునికి అభిషేకాలు జరిపారు. మండలంలోని సంగమేశ్వరంలో శ్రీగంగా పార్వతీ సమేత సంగమేశ్వరస్వామి వార్షిక మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవం శోభాయమానంగా జరిగింది. లింగోద్భవ కాలంలో గణపేశ్వరస్వామికి అభిషేకాలు జరిపారు.

అలరించిన సంగీత విభావరి

శ్రీరామ పాద క్షేత్రం ఘాట్‌లో కృష్ణానది ఒడ్డున ప్రత్యేక వేదికపై శుక్రవారం రాత్రి నిర్వహించిన శివయ్య జానపద గీతాల సంగీత విభావరి భక్తులను అలరించింది. విజయవాడకు చెందిన శ్రీకృష్ణవేణి బృందం, ప్రముఖ గాయకులు దామోదర గణపతిరావు, యడవల్లి నానిబాబు ఆధ్వర్యంలో మహాశివుడికి సంబంధించిన జానపద గీతాలు, సినిమా భక్తిగీతాలు భక్తిరస పారవశ్యంతో ఆలపించి ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. విభావరి తదుపరి క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో తొమ్మిది మంది కళాకారులను దివి యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్(రాజా) చేతులమీదుగా సన్మానించారు. ఉప్పల లీలాకృష్ణప్రసాద్, క్షేత్రపాలకుడు తలశిల రఘశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చిన సీఎం జగన్

అవనిగడ్డలో ఇళ్లపట్టాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే సింహాద్రి



అవనిగడ్డలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నెరవేర్చారని శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ అవనిగడ్డ మండలంలో మొత్తం 27.89 ఎకరాలు సేకరించగా వీటి కోసం రూ.7.84 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. మొత్తం 1505 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసినట్టు చెప్పారు. గతంలో ఎన్నడూ నియోజకవర్గంలో ఇంత పెద్ద మొత్తంలో ఇళ్ల స్థలాల పంపిణీ జరగలేదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు పంచి, ఇళ్లు కట్టించి ఇస్తుంటే ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక అడ్డుపడుతున్నారని విమర్శించారు. పేదలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, పార్టీ యువనేత సింహాద్రి వికాస్, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్‌నజీర్‌బాషాతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి



మోపిదేవిలో స్వామివారి చిత్రపటం అందుకుంటున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మోపిదేవి(కృష్ణాజిల్లా): స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని తూర్పుగోదావరి జిల్లా రాజానగరం శాసనసభ్యుడు జక్కంపూడి రాజా శనివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

అందరికీ స్వామివారి దీవెనలు ఉండాలి

దేశంలోనే ఎంతో విశిష్టత గల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దీవెనలు రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. రెండోసారి జగనన్న ముఖ్యమంత్రి అయి మరింత సంక్షేమం, అభివృద్ధి చేయాలని స్వామివారిని ప్రార్థించినట్లు వివరించారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

కోనేరుసెంటర్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు తెలిపారు. ఆయన శనివారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా గ్రామాల పెద్దలతో కలిసి శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారు. తొలుత మేకవానిపాలెం గ్రామంలో రూ.20 లక్షల గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కోనలో కోటి రూపాయలతో చేపట్టనున్న పైప్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.13 లక్షల వ్యయంతో నిర్మించనున్న మైక్రో ఫిల్టర్ పనులను ప్రారంభించారు. వీటితో పాటు పి.టి.పాలెంలో మరో 13 లక్షల రూపాయలతో నిర్మించనున్న మైక్రో ఫిల్టర్ పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో అనేక గ్రామాల్లో రహదారులను అభివృద్ధి చేశామన్నారు. మిగిలిన రహదారులను వీలైనంత త్వరగా అభివృద్ధి చేస్తామన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చే ఎన్నికలలో జగన్ మోహన్ రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్‌లు, గ్రామపెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు పోషకాహార కిట్లు పంపిణీ



కిట్స్ అందచేసిన వెంకటకృష్ణ, రమాదేవి తదితరులతో అనాథ బాలలు

నాగాయలంక: గ్రామంలోని చైల్డ్ రక్షా ప్రాజెక్టు స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శనివారం జరిగిన ఒక సేవా కార్యక్రమంలో 50 మంది దీర్ఘకాల వ్యాధులు కలిగిన పిల్లలు, అనాథ బాలలకు అతిథుల చేతులమీదుగా నిత్యావసరాలు, పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన అక్షయ ఫౌండేషన్ అధినేత మాదివాడ వెంకటకృష్ణ మాట్లాడుతూ చాలా కాలంగా చైల్డ్ రక్ష సంస్థ ఈ ప్రాంతంలో అందిస్తున్న సేవలను కొనియాడారు. కేంద్ర సెన్సార్ బోర్డు మాజీ సభ్యురాలు భోగాది రమాదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ భోగాది శివ విష్ణువర్ధన్, బోనం పాపారావు, సంస్థ నిర్వాహకుడు ఎం.వెంకటేశ్వరరావు, సిరి సోషల్ సర్వీస్ సొసైటీ ప్రతినిధి ఎం.కోటేశ్వరమ్మ, స్థానిక వృద్ధుల ఆశ్రమం నిర్వాహకుడు తలశిల లీలామనోహర్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణకాశీలో వైభవోపేతంగా రథోత్సవం



పెదకళ్లేపల్లిలో రథంపై ఊరేగుతున్న నాగేశ్వరస్వామివారు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణ కాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లి శ్రీ దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి రథోత్సవం శనివారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో వేదపండితులు ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు నిత్యబలిహరణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు సతీసమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి మేళతాళాలు, మంగళవాయిద్యాలతో స్వామివార్లను ప్రత్యేక పల్లకీలో ఆలయ ప్రదక్షణ నిర్వహించి, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించిన రథంపై ఆశీనులు చేశారు. తొలుత ఆలయ అనువంశిక ధర్మకర్తలు యార్లగడ్డ అంకినీడు ప్రసాద్, యార్లగడ్డ పద్మనాభ ప్రసాద్, యార్లగడ్డ శివరామ్ ప్రసాద్, యార్లగడ్డ ప్రవీణ్ చంద్ర ప్రసాద్, యార్లగడ్డ వివేక వర్ధన్ ప్రసాద్ స్వామివారికి పూజలు నిర్వహించి, టెంకాయలు కొట్టి సంప్రదాయబద్ధంగా రథం ప్రారంభించారు. అనంతరం గ్రామపెద్దలు, భక్తులు హరహరా అంటూ రథాన్ని ముందుకు లాగారు. కేరళ నృత్యం, డప్పు కళాకారుల సందడి, బాణసంచా మోతలతో స్వామివారి గ్రామోత్సవం ఉత్సాహంగా సాగింది. అర్ధరాత్రి వరకు ఊరేగింపు సాగింది. అనంతరం ఉభయ దేవేరులతో స్వామివారి ఆలయ ప్రవేశం జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో ప్రధాన వీధులు కిక్కిరిశాయి. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో చల్లపల్లి సీఐ నాగప్రసాద్ నేతృత్వంలో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

దుర్గానాగేశ్వరుని దివ్య కళ్యాణ మహోత్సవం

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం తెల్లవారుజామున 2 గంటలకు వేదమంత్రాల నడుమ మంగళవాయిద్యాలతో సంప్రదాయ పద్ధతిలో అంగరంగ వైభవంగా కల్యాణం జరిగింది. అంతకుముందు ఎదురుకోలు ఉత్సవం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో నందివాహనంపై స్వామివారు, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. దారిపొడవునా స్వామివార్లను దర్శించుకున్న భక్తులు టెంకాయలు, పూలు, పండ్లు అందించి చల్లని దీవెనలు అందుకున్నారు. రెండో రోజు శనివారం కూడా కృష్ణానదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

నాగాయలంకలో రేపు చేయూత చెక్కుల పంపిణీ

నాగాయలంక: నాలుగో విడత చేయూత కార్యక్రమంలో భాగంగా సోమవారం నాగాయలంకలో చేయూత లబ్ధిదారులకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేతులమీదుగా చెక్కులు అందజేయనున్నట్టు ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేమాలవారిపాలెంలోని నాగాయలంక మార్కెట్ యార్డులో ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, డ్వాక్రా మహిళలు, సంబంధిత అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహాసేన రాజేష్‌కు నిరసన సెగ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం వచ్చిన మహాసేన రాజేష్‌కు శనివారం నిరసన సెగ తగిలింది. టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దళిత శంఖారావం సభలో పాల్గొనేందుకు మహాసేన రాజేష్ వస్తున్నాడనే సమాచారంతో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు స్థానిక కోనేరుసెంటర్‌లో రాజేష్ కు వ్యతిరేకంగా 'హిందూ దేవతలను అవమానించిన రాజేష్' గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. దీంతో ఆ సెంటరు మీదుగా సభాస్థలికి వెళ్లాల్సిన రాజేష్‌ను పోలీసులు వేరే దారిలో పంపించారు. నగరంలో ర్యాలీ నిర్వహించాలని రెండు పార్టీల నాయకులు ముందు భావించారు. అయితే రాజేష్‌కు నిరసన సెగ ఎదురవుతుందనే సమాచారంతో ర్యాలీని రద్దు చేసి, కార్లలో నేరుగా సభాస్థలికి వెళ్లటం గమనార్హం. కోనేరుసెంటరు వైపుగా వెళుతున్న నాయకుల కార్లను వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని నియంత్రించారు.

నేడు చేయూత చెక్కుల పంపిణీ

పెడన: పెడన రూరల్‌లోని వెలుగు, పట్టణంలోని మెప్మా ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఆదివారం ఉదయం డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు చెక్కులను వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము), ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అందజేస్తారని రాము కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆ రోజు ఉదయం పది గంటలకు పెడన మార్కెట్‌యార్డులో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.